కొలువుల ఖిల్లా తెలంగాణ

పదేండ్లలో 2.24 లక్షల ఉద్యోగాలు • తెలంగాణ బిడ్డలకే అన్ని కొలువులు

- అసమానతలు లేకుండా నిర్ణయాలు
- అన్యాయాలకు కేసీఆర్ సర్కారు చెక్
- ఎంప్లాయీ ఫ్రెండ్లీ విధానాల అనుసరణ
- ఐదు నెలల్లో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం



హైదరాబాద్ ఫ్రీ జోన్.. ఓపెన్ కోటాను నాన్‌లోకల్ కోటాగా మార్చటం.. ఒక శాఖలో ఓపెన్ కోటా 30 శాతం ఉంటే మరోశాఖలో 40, ఇంకో శాఖలో 50 శాతం.. ఇదీ ఉద్యోగాల భర్తీలో తెలంగాణ బిడ్డలకు జరిగిన అన్యాయాల పరంపర. తరతరాలుగా మన కొలువులను కొల్లగొట్టిన తీరుకు కేసీఆర్ సర్కారు శాశ్వతంగా చరమగీతం పాడింది. మన కొలువులు మన బిడ్డలే దక్కించుకునేలా ఎన్నో సంస్కరణలు, మార్పులు చేసింది. పదేండ్లల్లో పటిష్టమైన విధానాలను రూపొందించి తెలంగాణ బిడ్డలకే కొలువులు దక్కేలా చేసింది.

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): సర్కారు కొలువులన్నీ తెలంగాణ బిడ్డలకే దక్కాలి..! ఈ గొప్ప సంకల్పంతో కేసీఆర్ సర్కారు ద్విముఖ వ్యూహాన్ని అనుసరించింది. కేవలం ఉద్యోగాల భర్తీకే పరిమితం కాలేదు.. అన్యాయాలు, అసమానతలు రూపుమాపే యజ్ఞానికీ శ్రీకారం చుట్టింది. కొత్త జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి 95 శాతం ఉద్యోగాలు మన బిడ్డలకే దక్కేలా కృషి చేసింది. ఫలితంగా నేడు ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగాలు వస్తున్నాయి. ఒకే అభ్యర్థి మూడు, నాలుగు ఉద్యోగాలు సాధిస్తున్నారు. పారదర్శకత, ప్రతిభకు పెద్దపీట వేయటమే ఇందుకు కారణం. పదేండ్ల కాలంలో గతం తాలూకు అన్యాయాలు లేవు. అసమానతలు అసలే లేవు.

2.24 లక్షల ఉద్యోగాల భర్తీ

కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో మొత్తం 2,24,142 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేసింది. 2014-22 మధ్య 1.33లక్షల ఉద్యోగాలను నింపి చరిత్ర సృష్టించింది. 2023లో ఏకంగా 80,039 ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపింది. 11,103 కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 27,305 పోస్టులు భర్తీ చేయగా, తాజాగా 17,516 పోస్టులను భర్తీ చేస్తున్నారు. గురుకుల రిక్రూట్‌మెంట్‌బోర్డు ద్వారా 11,715 పోస్టులు భర్తీచేయగా, ప్రస్తుతం 12,150 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది.ఉద్యోగార్థుల వయోపరిమితిపై ప్రభుత్వం పదేండ్ల సడలింపునిచ్చింది. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇస్తూ, భోజన వసతి కూడా కల్పిస్తున్నది. బీసీ స్టడీ సర్కిళ్లలో కూడా శిక్షణలను కొనసాగించింది.

జోనల్ వ్యవస్థ జీవనాడి

ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రపతి ఉత్తర్వులను అప్పటి ప్రభుత్వాలు యథేచ్ఛగా ఉల్లంఘించాయి. జిల్లా, జోనల్ పోస్టుల్లో 20, 30, 40 శాతం పోస్టుల భర్తీలో నాన్‌లోకల్ కోటాను అమలుచేశాయి. 80- 60శాతం ఉద్యోగాల్లోనే స్థానికులకు అవకాశమిచ్చాయి. పరీక్షలు, ఇంటర్వ్యూల్లోనూ అన్యాయమే జరిగేది. అస్తవ్యస్థంగా ఉన్న ఈ జోనల్ విధానాన్ని కేసీఆర్ ప్రభుత్వం ముందుగా సంస్కరించింది. కొత్త జోనల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇక్కడే కేసీఆర్ సర్కారు దూరదృష్టితో వ్యవహరించింది. అటెండర్ నుంచి ఆర్డీవో ఉద్యోగాల దాకా 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకు దక్కేలా నిబంధనలను సవరించింది. దీంతో తెలంగాణేతరులు మన రాష్ట్రంలోని ఉద్యోగాల్లోకి రాకుండా నిలువరించేందుకు పటిష్ట విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

కార్పొరేషన్లలోనూ స్థానిక కోటా

రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, కంపెనీలు, సొసైటీల్లో గతంలో స్థానిక కోటా అమలయ్యేది కాదు. ఆయా ఉద్యోగాలను ప్రాంతేతరులే కొల్లగొట్టారు. వీటిల్లోనూ స్థానిక కోటా అమలుచేయాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. దీంతో రాష్ట్రంలోని బేవరేజెస్, సివిల్ సప్లయిస్, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రెడ్కో, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, గిడ్డంగుల సంస్థ వంటి కార్పొరేషన్లు, సొసైటీలుగా కొనసాగుతున్న తెలంగాణ ఎస్సీ, మైనార్టీ, బీసీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీల్లోని ఉద్యోగాల్లో స్థానికులకు 95% రిజర్వేషన్లు దక్కుతున్నాయి.

ఇంటర్వ్యూలు రద్దు

అన్యాయాలు, అసమానతలకు తార్కాణంగా ఉన్న ఇంటర్వ్యూ విధానాన్ని కేసీఆర్ సర్కారు ఎత్తివేసింది. గ్రూప్స్ సహా పలు ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలను రద్దుచేసింది.

95 శాతం లోకల్ రిజర్వేషన్ ఉన్న రాష్ట్రం

గత ఉత్తర్వుల ప్రకారం ఆర్డీవో, డీఎస్పీ, సీటీవో, ఆర్టీవో, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, తదితర గ్రూప్ -1 ఉద్యోగాలకు లోకల్ రిజర్వేషన్ వర్తించేది కాదు. ఇప్పుడు ఇవన్నీ లోకల్ రిజర్వేషన్ల పరిధిలోకి వచ్చాయి. వీటిల్లో 95% ఉద్యోగాలు మనవాళ్లకే దక్కుతున్నాయి. టెండర్ నుంచి ఆర్డీవో దాకా 95 శాతం లోకల్ రిజర్వేషన్‌ను అమలుచేస్తున్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ.

క్రమబద్ధీకరణ ఫలాలు:

2014 జూన్ 2 నాటికి కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని మానవీయ దృక్పథంతో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. 5,544 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. దీంట్లో 3,897 మంది విద్యాశాఖకు చెందినవారే. వీరిలో అత్యధికంగా 2,909 మంది జేఎల్ వారు ఉన్నారు. వీరితో పాటు 184 మంది జేఎల్ (వొకేషనల్), 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డీఎల్, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్యారోగ్యశాఖలో 837 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, 179 మంది ఎల్టీ వారు, 158 మంది ఫార్మాసిస్టులు, 230 మంది సహాయ శిక్షణాధికారులు ఉన్నారు. 20,555 మంది వీఆర్ఏలు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులయ్యారు.

ఎంప్లాయీ ఫ్రెండ్లీ సర్కారు

రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్/గౌరవ వేతనం పొందుతున్న ఉద్యోగుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు పోషించిన పాత్రను అభినందిస్తూ 2014లో 'తెలంగాణ ఇంక్రిమెంట్' పేరుతో ప్రత్యేక ఇంక్రిమెంట్ ప్రకటించింది. గత ఏడేండ్లలో రెండుసార్లు వేతన సవరణ జరిగింది. 2015లో 43%, 2020లో 30% ఫిట్‌మెంట్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ వేతనాల పెంపుతో తెలంగాణ ఉద్యోగులు దేశంలోనే అత్యుత్తమ జీతాలు పొందుతున్న వారిగా నిలిచారు. కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనా 2020లో పీఆర్సీని ప్రకటించింది.

- కాంట్రాక్టు , ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతనం పొందుతున్న సిబ్బంది జీతాలు 2016లో 30-50 శాతం మ ధ్య, 2021లో 30% పెంచింది.
- పదోన్నతికి కనీస సర్వీస్‌ను రెండేండ్లకు కుదించింది. దీంతో 80% ఉద్యోగులు పదోన్నతులు పొందారు.
- రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 15% అదనపు పింఛన్ కోసం రూ.1,500 కోట్లు కేటాయించింది. ఈ పింఛన్ వయోపరిమితిని 75 నుంచి 70 ఏండ్లకు కుదించింది.

తెలంగాణ బిడ్డలకే అవకాశాలు

- ఇదివరకు రాష్ట్రంలో రెండు జోన్లు, 10 జిల్లాలు ఉండటంతో విద్యావకాశాలున్న వారికి మాత్రమే ఉద్యోగాలు దక్కేవి. కానీ కేసీఆర్ సర్కారు రాష్ట్రాన్ని భౌగోళిక విస్తీర్ణం ఆధారంగా 7 జోన్లు, 33 జిల్లాలుగా పునర్ వ్యవస్థీకరించింది. ఈ ప్రాతిపదికనే ఉద్యోగ నియామకాలు చేపట్టడం వల్ల రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని వారికీ ఆయా జిల్లాల్లోని పోస్టుల్లో పోటీ పడే అవకాశం దక్కింది.
- రాజధాని, హెడ్‌క్వార్టర్, హైదరాబాద్ ఫ్రీ జోన్ పేరుతో జరిగిన అక్రమాలు కోకొల్లలు. ఇప్పుడు ఆ ఫ్రీ జోన్‌ను సర్కారు ఎత్తివేసింది. హైదరాబాద్ జోన్-6 (చార్మినార్)లో అంతర్భాగం కాగా, మల్టీజోన్-1లోనూ భాగమైంది. దీంతో జిల్లా పోస్టులకు జిల్లా వారు, జోనల్ పోస్టులకు జోనల్, మల్టీజోన్ పోస్టులకు మల్టీ జోన్ పరిధిలోని వారు పోటీపడేలా పరిష్కారాన్ని చూపింది.
- స్టేట్ క్యాడర్ పోస్టులంటూ గతంలో అన్ని జిల్లాలవారు ఎగరేసుకుపోయేవారు. దీనికి ప్రభుత్వం ముగింపు పలికింది. స్టేట్ క్యాడర్ పోస్టులను తీసేసి, మల్టీజోన్ క్యాడర్ పోస్టుల వరకు పరిమితం చేసింది. దీంతో ఐఏఎస్, ఐపీఎస్ వంటి అధికారులే ఇప్పుడు స్టేట్ క్యాడర్ ఉద్యోగులు అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీచేసే ఉద్యోగాలను మల్టీజోన్ వరకే పరిమితం చేసింది.
- కొత్త ఉద్యోగాల భర్తీ కోసం రూ.7 వేల కోట్లు అవసరం ఏర్పడగా, 2023 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించింది.
- గతంలో 4-10 తరగతుల్లో ఏదేనీ నాలుగేండ్లు ఒకే జిల్లాలో చదివితే స్థానికులు కాగా, ప్రస్తుతం 1-7 తరగతుల్లో నాలుగేండ్లు చదివిన జిల్లాలో స్థానికులుగా మార్పుచేసింది.
- అన్ని రకాల ఉద్యోగాల భర్తీ వయోపరిమితిని సడలించింది. ఉద్యోగ నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని పదేండ్లకు పెంచింది. ఈ నిర్ణయంతో ఓబీసీలకు 44 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 49 ఏండ్లు, దివ్యాంగులకు 54 ఏండ్ల గరిష్ఠ వయోపరిమితి అమలు అవుతున్నది.

శాఖలు, విభాగాలవారీగా భర్తీ

సంస్థ	అనుమతి ఇచ్చినవి	నోటిఫికేషన్ జారీచేసినవి	భర్తీ చేసినవి	భర్తీదశలో ఉన్నవి
టీఎస్‌పీఎస్సీ	60,918	54,015	35,250	18,765
పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు	50,425	48,247	47,068	1,179
గురుకుల రిక్రూట్‌మెంట్‌బోర్డు	17,631	12,904	3,694	9,210
మెడికల్ రిక్రూట్‌మెంట్‌బోర్డు	14,283	9,684	2,047	7,637
డీఎస్సీ	34,100	28,534	22,892	5,642
యూనివర్సిటీ కామన్‌బోర్డు	105	00	00	00
ఇతర సంస్థలు	54,846	49,351	49,132	219
మొత్తం	2,32,308	2,02,735	1,60,083	42,652

ఒక్క నోటిఫికేషన్ ఇవ్వని కాంగ్రెస్

'**జాబ్** క్యాలెండర్.. ఏడాదికి ఒకసారి గ్రూప్-1, ఏడాదికి రెండుసార్లు గ్రూప్ 2, 3,4 నిర్వహిస్తాం. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఇది కాంగ్రెస్ గ్యారెంటీ..' అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కొత్త నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేయలేదు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను దగా చేసింది. జాబ్ క్యాలెండర్ పత్తాలేకుండా పోయింది. ఏప్రిల్ 1న ఇస్తామన్న నోటిఫికేషన్‌తో ఏప్రిల్ ఫూల్ చేసింది. పైగా కేసీఆర్ సర్కారు పరీక్షలు నిర్వహించగా, రేవంత్ ప్రభుత్వం ఫలితాలు ప్రకటించి, నియామక పత్రాలిచ్చి వాటిని తామే భర్తీచేశామని క్రెడిట్ కొట్టేందుకు తాపత్రయపడుతున్నది. పాతవి రద్దుచేసి తమ ఖాతాలో వేసుకొన్నది. గత కేసీఆర్ సర్కారు 503 పోస్టులతో ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి మరో 60 పోస్టులను కలిపి 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. 5,089 పోస్టుల భర్తీకి జారీచేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దుచేసి, అదనంగా 5,973 పోస్టులు కలిపి కొత్తగా 11,062 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు తమ ఖాతాలో వేసుకొన్నది. నిరుద్యోగుల నుంచి ఒక్క రూపాయి ఫీజు తీసుకోబోమని, టెట్ ఫీజును రూ.వెయ్యికి పెంచింది. గ్రూప్ 1, డీఎస్సీ సహా అన్ని పోస్టుల భర్తీకి ఎక్కడాలేని ఫీజులను వసూలు చేస్తున్నది. అంతేకాకుండా ఉద్యోగులను దారుణంగా మోసగించింది. పెండింగ్ డీఏలను విడుదల చేయయలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఉద్యోగులను ఉత్తచేతులతో ఇంటికి పంపిస్తున్నది. హెల్త్‌కార్డులు పత్తాలేకుండా పోయాయి. పెండింగ్ బిల్లులు ఆర్థిక శాఖ వద్దే మూలుగుతున్నాయి.

నాడు - నేడు

నాడు జలకళ

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలో అన్నపూర్ణ ప్రాజెక్టు బీఆర్ఎస్ సర్కారు హయాంలో నిత్యం నీటితో కళకళలాడుతూ ఉండేది. రైతాంగానికి ఆదరువుగా నిలిచింది. నిరుడు మే నెలలో మండుటెండల్లో సైతం ప్రాజెక్టు నిండుకుండలా కనిపించింది.

నేడు వెలవెల

అన్నపూర్ణ ప్రాజెక్టు అడుగంటింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును పట్టించుకోకపోవడం, ఎత్తిపోతలు నిలిపివేయడంతో నీరు లేక బోసిపోయింది. నిరుడు ఇదే సమయానికి నీటితో కళకళలాడిన ప్రాజెక్టు, ఇప్పుడు ఎడారిగా మారింది. - ఇల్లంతకుంట

కటకటాల్లోకి అవినీతి ఏసీపీ

- **ఉమామహేశ్వర్‌రావుకు జూన్ 5 వరకు రిమాండ్**
- **రూ.3.95కోట్ల ఆస్తులు కలిగినట్టు ఏసీబీ వెల్లడి**
- **బయటకొస్తున్న బాధితులు**

నాంపల్లి కోర్టులు, మే 22 (నమస్తే తెలంగాణ) : అవినీతి, అక్రమాలతో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడనే కేసులో సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావుకు జూన్ 5వరకు రిమాండ్ విధిస్తూ నాంపల్లి ఏసీబీ కోర్టు జడ్జి మహ్మద్ అఫ్రోజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఉమామహేశ్వర్‌రావు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు వివరాలను ఏసీబీ అధికారులు అధికారికంగా విడుదల చేశారు. సోదాల్లో రూ. 3.95 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించామని వెల్లడించారు. ఇది ప్రభుత్వ మార్కెట్ విలువ మాత్రమేనని, బహిరంగ మార్కెట్లో విలువ చాలా ఎక్కువ ఉంటుందని చెప్పారు. లాకర్లు తెరువాల్సి ఉందని, మరిన్ని ఆస్తుల సమాచారం విచారణలో వెలుగులోకి వస్తుందని తెలిపారు. కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకొని విచారిస్తామని వివరించారు.

ల్యాప్‌టాప్‌లో అవినీతి, అక్రమాల చిట్టా..

ఉమామహేశ్వర్‌రావు ఇంట్లో సోదాలు చేసిన సమయంలో బినామీ ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా పోలీసులకు లభ్యమయ్యాయి. వీటితో పాటు ఒక ల్యాప్‌టాప్‌ను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డబ్బులు ఇచ్చిన వారు, ఆస్తుల వివరాలన్నీ అందులో ఉన్నట్టు గుర్తించారు. ల్యాప్‌టాప్‌లో దొరికే సమాచారం ఆధారంగా మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఉమామహేశ్వర్‌రావు ఇబ్రహీంపట్నంలో ఉన్నప్పుడు పలు సివిల్ కేసుల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయన బాధితులు ఒక్కొక్కరుగా బయటకొచ్చి తమకు జరిగిన అన్యాయంపై నోరు విప్పుతున్నారు. ఓ ల్యాండ్ విషయంలో తాను ఫిర్యాదు చేస్తే రూ.10లక్షల లంచం ఇవ్వలేదని ప్రత్యర్థుల నుంచి రూ.50లక్షలు తీసుకొని తనపైనే రెండు తప్పుడు కేసులు నమోదు చేశాడని, పైగా రౌడీ షీట్ తెరుస్తానని బెదిరించాడని ఓ బాధితుడు ఆరోపించాడు. తనపై నమోదైన కేసులపై హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు సైతం ఉమామహేశ్వర్‌రావుకు మొట్టికాయలు వేసిందని చెప్పాడు.

భార్య ముందే భర్తపై మహిళా ఎస్సై దౌర్జన్యం

- **బాధిత దంపతులపైనే దాడి.. భర్త మర్మాంగాలపై తన్నులు**
- **మహిళ జేబులోంచి ఫోన్ లాక్కున్న కానిస్టేబుల్**
- **కులం పేరుతో దూషణలు**
- **మలుపుతిరిగిన మధురానగర్ వైన్స్ ఘటన**
- **ఎస్సీ కమిషన్‌కు బాధితుల ఫిర్యాదు**

మధురానగర్‌లోని మధురా వైన్స్ వద్ద జరిగిన దాడి ఘటన దృశ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో/వెంగళ్‌రావునగర్, మే 22 (నమస్తే తెలంగాణ): ఫ్రెండ్లీ పోలీసింగ్ మంటగలిసింది.. తమపై దాడి జరిగింది.. న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేయడానికి వచ్చిన దంపతులపట్ల ఓ మహిళా ఎస్ఐ దౌర్జన్యానికి దిగారు. భార్య కండ్ల ముందే భర్త మర్మాంగాలపై కాలితో తన్నినట్టు బాధితులు చెప్తున్నారు. అంతటితో ఆగకుండా వారిని కులంపేరుతో దూషించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నెల 17న మధురానగర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఓ వైన్స్ షాప్ యజమానితో కుమ్మక్కైనట్టు ఆరోపణలు వస్తుండగా.. పోలీసులు బాధితులపై రెండు కేసులు, వైన్‌షాప్ యజమానిపై ఒక కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

ఈ నెల 17న వెంగళ్‌రావునగర్‌కు చెందిన సినిమాటోగ్రాఫర్ ఎర్రోళ్ల రమేశ్ మధురానగర్‌లోని మధురా వైన్స్ వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసి మద్యం ఇవ్వాలని అడిగాడు. దుకాణంలోని సిబ్బంది తమకు పేమెంట్ జరిగినట్టు ఇంకా మెసేజ్ రాలేదని కొద్దిసేపు ఆగాలని అన్నారు. ఎంతకీ దుకాణం సిబ్బంది మద్యం సీసా ఇవ్వకపోవడంతో రమేశ్ వారిని నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వావాదం పెరిగింది. ఇంతలో దుకాణంలోని సిబ్బంది బయటకు వచ్చి ఓ ఖాళీ సీసాతో రమేశ్ తలపై కొట్టారు. భర్త తల నుంచి రక్తం కారడం చూసి తట్టుకోలేక అతని భార్య దుకాణంలోకి వెళ్లి సిబ్బందిపై దాడి చేసిందని పోలీసులు చెప్తున్నారు. మద్యం దుకాణం సిబ్బందిపై, పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసినందుకు రమేశ్, అతని భార్య మీద, రమేశ్ మీద దాడి చేసినందుకు మద్యం దుకాణం సిబ్బంది మీద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

జరిగింది ఇది: బాధితులు

వైన్స్ సిబ్బంది తమపై దాడి చేసిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మధురానగర్ ఠాణాకు వెళ్లామని రమేశ్ దంపతులు చెప్పారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఎస్ఐ తమ ఫిర్యాదు తీసుకోకపోగా తమను దుర్భాషలాడారని అన్నారు. తమను ముందుగా ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు) నమోదు చేసేందుకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని రావాలని ఆదేశించారని తెలిపారు. నిబంధనల ప్రకారం తమతో ఒక పోలీసును పంపాలని కోరగా తమనే వెళ్లాలని గద్దించారని చెప్పారు. వారిద్దరూ ఎస్ఆర్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి వైద్య పరీక్ష చేయించుకొని తిరిగి వస్తుండగా.. ఇంతలో ఓ కానిస్టేబుల్ తమకు ఫోన్ చేశాడని తెలిపారు. వైన్స్ షాప్‌లో తమపై దాడిచేసిన వారెవరో గుర్తించేందుకు తిరిగి తమను మధురా వైన్స్ వద్దకు రమ్మని చెప్పాడన్నారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించాలి కదా అని తాము కోరగా.. లేదు తమను వైన్స్ వద్దకే రావాలని కానిస్టేబుల్ ఒత్తిడి చేశారని తెలిపారు. తామిద్దరం మద్యం దుకాణం వద్దకు వెళ్లగానే ఆ సిబ్బంది తమపై మరోసారి దాడి చేశారని చెప్పారు. ఈ దృశ్యాలను రమేశ్ భార్య వీడియో తీస్తుండగా.. ఆ సిబ్బంది కానిస్టేబుల్ సమక్షంలోనే ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారని తెలిపారు. ఆ తరువాత రమేశ్ భార్య జేబులో నుంచి కానిస్టేబుల్ సెల్‌ఫోన్ లాక్కున్నాడని అన్నారు. దీనంతటిపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మహిళా ఎస్ఐకి వివరించగా, ఆమె తమనే తప్పుపట్టారని చెప్పారు. ఎస్ఐ తమను కులం పేరు అడిగారని, తమది ఎస్సీ కులమని చెప్పగానే.. కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తంచేశారు. అంతటితో ఆగకుండా రమేశ్‌ను అతని భార్య ఎదుటే కొడుతూ అతని మర్మాంగాలపై మూడుసార్లు తన్నిందని చెప్పారు. తమపై జరిగిన దాడి ఘటనలను అక్కడి సీసీటీవీ కెమెరాలలో చూసి తెలుసుకోవచ్చని అన్నారు. రోజంతా పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారని, మరుసటి రోజు ఏసీపీ వచ్చిన తరువాత వదిలిపెట్టారని రమేశ్ చెప్పారు. బాధితులమైన తమను కులం పేరుతో దూషించడం, హింసించారని ఆరోపిస్తూ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బాధితుల ఆరోపణలపై విచారణకు ఆదేశించామని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ చెప్పారు.

ఏసీబీకి పట్టుబడ్డ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్

ఏసీబీకి చిక్కిన మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్

భైంసా, మే, 22 : లంచం తీసుకుంటూ మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా భైంసాలో చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన రాధేశ్యామ్ భైంసా-నిర్మల్ రోడ్డులో 2022 సంవత్సరంలో కమర్షియల్ భవన నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ శాఖ అనుమతి తీసుకుని ఆస్తి పన్ను కూడా చెల్లించారు. సదరు భవనం అక్రమ నిర్మాణం అంటూ మున్సిపల్ కమిషనర్ ఈనెల 16న నోటీసు జారీ చేశారు. రూ.30 వేలు లంచం ఇవ్వాలని బిల్ కలెక్టర్ విద్యాసాగర్ ద్వారా డిమాండ్ చేయించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా బుధవారం పథకం ప్రకారం.. రాధేశ్యామ్ బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌కు రూ.30 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మళ్లీ టోల్ బాదుడు

జాతీయ రహదారులపై 5 శాతం చార్జీల పెంపు

కేంద్ర సర్కార్ నిర్ణయం.. జూన్ 1 అర్ధరాత్రి నుంచి అమలు

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ చార్జీలు మళ్లీ పెరగనున్నాయి. ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి టోల్ చార్జీలు పెరుగుతాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెంపు వాయిదా పడింది. జూన్ 1న ఆఖరి విడత పోలింగ్ ముగియనున్నది. అదే రోజు అర్ధరాత్రి నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. మొత్తం ఐదు శాతం మేర టోల్ చార్జీలను పెంచనున్నట్టు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు. పెరగనున్న టోల్ చార్జీల ప్రకారం యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద కార్లు, జీపులు, వ్యాన్లకు రెండు వైపులా ప్రయాణానికి రూ.5, చిన్న లారీపై రూ.10 చొప్పున పెరిగాయి. వాణిజ్య, భారీ గూడ్స్ లారీలకు రూ.15 చొప్పున చార్జీలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న హైదరాబాద్-విజయవాడ (65), హైదరాబాద్-వరంగల్ (163) జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా పరిధిలోని చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని చిల్లకల్లు (నందిగామ), వరంగల్ హైవేపై బీబీనగర్ మండలం గూడురు టోల్ ప్లాజాలు ఉన్నాయి.

భార్యలుండగా సహజీవనం.. ఎస్సై, కానిస్టేబుల్ సస్పెన్షన్

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): పరాయి స్త్రీలతో సహజీవనం చేసిన వ్యవహారంలో సిద్దిపేట కమిషనరేట్‌కు చెందిన కొమురవెల్లి ఎస్సై ఎం నాగరాజుతోపాటు కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ పీ శ్రీనివాస్‌ను మల్టీ జోన్-1 ఐజీపీ ఎంవీ రంగనాథ్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొమురవెల్లి ఎస్సై నాగరాజు, కానిస్టేబుల్ శ్రీనివాస్ తమ భార్యలకు విడాకులు ఇవ్వకుండా పరాయి స్త్రీలతో సహజీవనం చేస్తున్నట్టుగా ఆరోపణలు వచ్చాయి. ఎస్సై నాగరాజు భార్య ఇటీవల తన పిల్లలతో కలిసి కొమురెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. విచారణలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఐజీ ఈ మేరకు చర్యలు తీసుకొన్నారు.